అకతాయిల దాడిలో టీవీ ధ్వంసం

ధ్వంసమైన ఎల్‌సీడీ టీవీని పరిశీలిస్తున్న డీఎస్పీ సతీష్ కుమార్

అశ్వారావుపేట, సెప్టెంబర్ 15: మండలంలోని మామిళ్ళవారిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఎల్ సీడీ టీవీని అకతాయిలు ధ్వంసం చేశారు. ఉపాధ్యాయుల ఫిర్యాదుతో పాఠశాలను పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం పరిశీలించారు. ఆధారాలను క్లూస్ టీం సేకరించింది. కొద్ది రోజుల క్రితం, నారంవారిగూడెంలో దుండగుల దాడిలో గాయపడ్డ సూర్యనారాయణ దంపతులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. ఆ ఇంటి పరిసరాలను పరిశీలించారు. సీఐ కరుణాకర్, ఎస్సై శివరామకృష్ణ పాల్గొన్నారు.

'ఏచూరి'కి నివాళి

అశ్వారావుపేట, సెప్టెంబర్ 15: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను సీటీఐయూ నాయకులు ఆదివారం అశ్వారావుపేటలో నిర్వహించారు. చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. పిట్టల అర్జున్, ఏసు, నాగేంద్ర, రమేష్, రాంబాబు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 15: కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో అధ్యయనం స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభ ఆదివారం జరిగింది. చిత్రపటం వద్ద స్టడీ సర్కిల్ జిల్లా కన్వీనర్ ఏజే రమేష్, నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, అన్నవరపు సత్యనారాయణ, భూక్యా రమేష్, సత్య, నందిపాటి రమేష్, ఉపేష్ తదితరులు పూలు చల్లి నివాళులర్పించారు.

రాజుపేట వాసుల చింతలు తీరేదెన్నడో..!

చింతల చెరువుల నిండితే దారి బంద్
ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
పట్టించుకోని పాలకులు, అధికారులు

చెరువులో నిండడంతో మునిగిన రాజుపేట దారి

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 15: పది ఇళ్లు.. సుమారు 40 మంది ప్రజలు చిన్న గ్రామం.. ఆదే రాజుపేట (కుర్సం గుంపు). ఈ గ్రామం దమ్మపేట మండలం పార్కలగండి పంచాయతీ పరిధిలో వుంది. ఈ గ్రామానికి వెళ్లాలంటే పార్కలగండికి వెళ్లే రోడ్డు పక్కన వుండే చింతల చెరువు పక్క నుంచే మాత్రమే దారి ఉంది. ఏటా చెరువు నిండగానే రాజుపేటకు రాకపోకలు నిలిచిపోతాయి. కొంత కాలం చెరువు నిండిన సమయంలో గ్రామస్తులు చుట్టుప్రకల ఉన్న జీడి మామిడి, మామిడి తోటల్లోంచి రాకపోకలు సాగించేవారు. కాలక్రమేణా మామిడి, జీడిమామిడి తోటల స్థానంలో పామాయిల్ తోటలు వచ్చాయి. తోటలకు ముళ్ల తీగల ఫెన్సింగ్ వేసుకోవడంతో రాకపోకలకు చెరువు పక్క నుంచి వుండే దారి మాత్రమే మిగిలింది. ప్రతి ఏటా వర్షాకాలంలో చింతల చెరువు నిండుతుంది. చెరువులో నీరు నిల్వ ఉన్నన్ని రోజులు రాజుపేట గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. చెరువు నిండిన ప్రతిసారి గ్రామస్తులు పామాయిల్ తోటలకు వేసిన పెన్సింగ్ దూరి వెళ్లాల్సిందే. అత్యవసర పరిస్థితి ఏర్పడితే మా గతేమిటని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజుపేట (కుర్సం గుంపు) గ్రామం

చెరువుకు అలుగు లేకపోవడంతో..

చింతల చెరువుకు అలుగు నిర్మాణం జరగలేదు. అలుగు కాలువ సైతం లేదు. చింతల చెరువులో పరిమితికి మించి నీరు నిల్వవుండి రాజుపేట గ్రామ ప్రజలతో పాటు చెరువు శివారు రైతులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

నీటిపారుదల శాఖ డిప్యూటీ ఈఈ క్రిష్ణ వివరణ

రెవెన్యూ శాఖకు చెరువ భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు అభ్యర్థన లేఖ పంపించాము. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

కనుల పండువగా రామయ్య కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబర్ 15: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అంతరాలయంలో అర్చకులు మూలవరులకు 108 స్వర్ణపుష్పాలతో అర్చన జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

భద్రాద్రి రామయ్య సన్నిధిలో ఓఎస్డీ

స్వామివారిని దర్శించుకుంటున్న కొత్తగూడెం ఓఎస్‌డీ పారితోజ్ పంకజ్ దంపతులు

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 15: భద్రాచలం సీతారామచంద్రస్వామివారిని భద్రాద్రి కొత్తగూడెం ఓఎస్డీ పారితోజ్ పంకజ్ దంపతులు ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తొలుత అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి గర్భగుడిలో పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

అన్నదానానికి దాతల వితరణ

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబర్ 15: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి ఖమ్మం మామిళ్లగూడెనికి చెందిన దండి కోటయ్య, విమలమ్మ పేరుతో వారసులు దండి ప్రేమ్‌కుమార్, దండి శ్యామ్‌కుమార్ ఆదివారం ఆలయ ఈవో రమాదేవికి రూ.1,16,116 వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా అన్నదాన పత్రాన్ని దాతలకు ఈవో అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలకత్తా కళాకారులకు సన్మానం

కళాకారులను సన్మానిస్తున్న వర్తక సంఘం బాధ్యులు

సారపాక, సెప్టెంబర్ 15: సారపాక వర్తక సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవరసిద్ధి వినాయక విగ్రహాన్ని మట్టితో తయారుచేసిన కలకత్తా కళాకారులను ఆదివారం వర్తక సంఘం బాధ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. విగ్రహ దాతలు ఎస్ఎల్‌బీటీ పెయింట్స్ భూమా చంద్రశేఖర్, నాగలక్ష్మి, వారి కుమారులు భూమా సూర్యతేజ, భూమా మణికంఠతో పాటు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో వర్తకసంఘం బాధ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేట, సెప్టెంబర్ 15: మండలంలో మామిళ్ళవారిగూడెం నుంచి అశ్వారావుపేట వైపు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్సై శివరామకృష్ణ పట్టుకున్నారు. దానిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక తరలిస్తున్న వనమా నాగరాజుపై కేసు నమోదు చేశారు.

నిమజ్జన ఊరేగింపులో డీజేలు నిషేధం

చుంచుపల్లి, సెప్టెంబర్ 15: ఈ నెల 16,17 తేదీల్లో జరిగే గణేష్ నిమజ్జన ఊరేగింపుల్లో డీజే సౌండ్ బాక్సులను వాడకూడదని ఎస్సై రవికుమార్ ఒక ప్రటనలో స్పష్టం చేశారు. ఎవరైనా డీజే సౌండ్ సిస్టం పెడితే వెంటనే సీజ్ చేయడంతోపాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దిగుమతి సుంకం పెంపుపై హర్షం

దమ్మపేట, సెప్టెంబరు 15: క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం 20 శాతానికి పెంచడంపై పామాయిల్ రైతు సంఘం నాయకుడు పైడి వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేశారు.

నేటి 'ప్రజావాణి' రద్దు

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 15: ఐడీవోసీలో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మిలాద్ ఉన్ నబీ పండుగ సెలవు కారణంగా అధికారులు అందుబాటులో ఉండరని పేర్కొన్నారు. ప్రజలెవరూ కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

కేటీపీఎస్ కార్మికుడి ఆత్మహత్య

పాల్వంచ, సెప్టెంబర్ 15: కేటీపీఎస్ కార్మికుడు మల్లూరి శ్రీకాంత్(38) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారంలోని కోల్ ప్లాంట్‌లో జేపీఏగా పనిచేస్తున్న శ్రీకాంత్, కేటీపీఎస్ ఏ-కాలనీ క్వార్టర్ జీ37లో కుటుంబంతో ఉంటున్నాడు. కుటుం కలహాల నేపథ్యంలో భార్య నవీన, మూడు రోజుల కిందట ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో, శ్రీకాంత్ ఆదివారం తన స్నేహితుడికి ఫోన్ చేసి, ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా చెప్పాడు. ఆ స్నేహితుడు ఎంతగా చెప్పినా కూడా వినిపించుకోలేదు. ఆ స్నేహితుడు వెంటనే శ్రీకాంత్ క్వార్టర్‌కు చేరుకున్నాడు. అప్పటికే, బెడ్ రూంలోని ఫ్యాన్‌కు ఉరేసుకున్న స్థితిలో విగత జీవిగా శ్రీకాంత్ కనిపించాడు. చుట్టుపక్కల వారిని పిలిచి, కిందికి దించారు. ఈ సమాచారంతో ఎస్సై సుమన్ అక్కడికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జిల్లా నాల్గవ తరగతి హౌస్ బిల్డింగ్ సొసైటీ కమిటీ ఎన్నిక

పాల్వంచ, సెప్టెంబర్ 15: జిల్లా నాల్గవ తరగతి హౌజ్ బిల్డింగ్ సొసైటీ కమిటీని స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షురాలిగా కృష్ణవేణి, కార్యదర్శిగా రమణ, ఉపాధ్యక్షుడిగా దినేష్, ట్రెజరర్‌గా పూర్ణ, డైరెక్టర్లుగా దేవేందర్, ఉమా మహేశ్వరరావు, రాజమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అదికారులుగా హనుమాన్, రాజు వ్యవహరించారు.

బాలికల పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

పాల్వంచ, సెప్టెంబర్ 15: పాత పాల్వంచలోని ఓ ప్రైవేట్ కాలేజీలో నిర్వహిస్తున్న తెలంగాణ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. తమ పిల్లలను చూసేందుకు తల్లిదండ్రులు వచ్చారు. వంటలు నాణ్యంగా లేవని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. దురుసుగా వ్యవహరించిన వంట నిర్వాహకులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గతంలో ఎన్నడూ ఇంత అధ్వానంగా వంటలు లేవని, ఈ విద్యా సంవత్సరంలోనే ఇలా జరుగుతున్నదని ఆగ్రహించారు. వారికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమాదేవి సర్దిచెప్పి, ఇకపై వంటలు నాణ్యంగా ఉండేలా చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు శాంతించారు. దీనిపై ఉభయ జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ బీవ్లా రాణిని 'నమస్తే' సంప్రదించగా... ''ఈ విషయం నా దృష్టికి వచ్చింది. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం'' అని చెప్పారు.

ఏకదంతుడికి పూజలు, అన్నదానాలు

సారపాక : తాళ్లగొమ్ముూరులో గణనాథుని మండపం వద్ద అన్నదానంలో భక్తులు

ఆళ్లపల్లి : ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దమ్మపేట : మాజీ ఎమ్మెల్యే మెచ్చాను సత్కరిస్తున్న గణేష్ మండప నిర్వాహకులు

గుండాల : అమ్మ హోటల్ సెంటర్‌లో అన్నదానం

దుమ్ముగూడెం : మండపం వద్ద విద్యార్థులతో గరికపూజ చేయిస్తున్న అర్చకులు

యాదవ్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

సారపాక, సెప్టెంబర్ 15: మండల పరిధిలోని తాళ్లగొమ్ముూరులో పవన్ ఐటీఐ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని మండపం వద్ద గుమ్మడి కృష్ణవేణి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 15: పట్టణంలోని కూరగాయల మార్కెట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాకాంబర గణపతిని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సోమ సతీష్‌కుమార్, ఎస్ఐ మేడ ప్రసాద్ దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి వద్ద ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గుండాల, సెప్టెంబర్ 15: మండల కేంద్రంలోని అమ్మ హోటల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు.

దుమ్ముగూడెం, సెప్టెంబర్ 15: మండల కేంద్రమైన లక్ష్మీనగరంలో శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో 9వ రోజు విద్యాగణపతి అవతారంలో గణనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత విద్యార్థులతో గరికపూజ నిర్వహించి అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబర్ 15: భద్రాచలం పట్టణంలోని జగదీష్‌కాలనీలో యాదవ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని బీఆర్ఎస్ మండల నాయకులు సునీల్‌కుమార్ ప్రారంభించారు.

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 15: మండల కేంద్రంలోని భగత్‌సింగ్ సెంటర్ వద్ద వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త అనుమోల వెంకటేశ్వర్లు-సువర్ణ దంపతులు, అనంతోగు గ్రామంలో ప్రముఖ వ్యాపారవేత్త కందిమళ్ళ బసవయ్య-ధనలక్ష్మి దంపతులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అఘాయిత్యాలు అధికం.. అడ్డుకోవడంలో విఫలం

అశ్వారావుపేట, సెప్టెంబర్ 15: దేశంలో మహిళలపై ప్రతి రోజూ దాడులు, దౌర్జన్యాలు, అఘాయిత్యాలు పెరుగుతూనే ఉన్నాయని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెచ్చల కల్పన ఆవేదన, ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అడ్డుకోవడంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. సంఘం స్థానిక కార్యాలయంలో ఆదివారం డివిజన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు.

విధులను అడ్డుకుంటే చర్యలు

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 15: సింగరేణి ఉద్యోగుల విధులను అడ్డుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏరియా జీఎం జాన్ ఆనంద్ హెచ్చరించారు. ఆయన అదివారం ఏరియా వర్క్‌షాప్‌లో భద్రత పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఉత్తమ రక్షణ సూత్రాలు పాటిస్తున్న ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. అధికారులు నాగరాజు నాయక్, వీరూనాయక్, సాయి స్వరూప్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

ఇల్లెందు రూరల్,సెప్టెంబర్ 15: ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతిచెందింది. మండలంలోని సుభాష్ నగర్ కరెంట్ ఆఫీస్ ఏరియాలో ఆదివారం రోడ్డు దాటుతున్న బానోత్ తులసి(80)ని ఇల్లందు నుంచి ఖమ్మం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. బొజ్జాయిగూడెం పంచాయతీ వేపలగడ్డ గ్రామానికి చెందిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకు నిలయాలు.. ప్రకృతి వనాలు!

'హరిత' లక్ష్యంపై కొరవడిన పర్యవేక్షణ

పల్లెప్రకృతి వనంలో మొక్కలు మేస్తున్న పశువులు

మోతే పట్టీనగర్ పల్లెప్రకృతివనం

సారపాక, సెప్టెంబర్ 15: రాష్ట్రం పచ్చదనంతో విలసిల్లాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు పశువులకు నిలయాలుగా మారుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం పల్లెప్రకృతి వనాల్లో వివిధ రకాల మొక్కలు పెంచి ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం కోసం వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేలా క్రీడా పరికరాలు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం పల్లెప్రకృతి వనాల సంరక్షణ బాధ్యతను ఎవరూ పట్టించుకోకపోవడంతో సంరక్షణ కరువై పశువుల ఆహారానికి నిలయాలుగా మారాయి.

ప్రజలకు ఆహ్లాదం.. పశువులకు ఆహారం

ప్రజలకు ఆహ్లాదం.. పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు పశువులకు మేతగా మారుతున్నాయి. మండల పరిధిలోని మోతే పట్టీనగర్ పల్లెప్రకృతి వనం చుట్టూ రక్షణ వలయం ఉన్నా, గేట్లు వేసి ఉన్నా పశువులు మేత మేయడం కనిపించింది. పల్లెప్రకృతి వనాలను పరిరక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యంతో ఇలా పశువుల మేతకు నిలయంగా మారాయి. పల్లెప్రకృతి వనాలను నేటి పాలకులు ఇలా మార్చడం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పంచాయతీ కార్యదర్శి ఏమన్నారంటే..

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సావిత్రిని వివరణ కోరగా.. పల్లె ప్రకృతివనం చుట్టూ పెన్సింగ్ చేయించాము. గేటు కూడా ఉన్నది. పశువులు ప్రకృతివనం లోకి ఎలా వెళ్లాయో తెలియదు. మా సిబ్బందిని అక్కడకు పంపించి చూస్తామని చెప్పడం కొసమెరుపు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఎంపీడీవో

ఈ విషయమై ఎంపీడీవో జమలారెడ్డిని 'తెలంగాణ' వివరణ కోరగా పంచాయతీల్లో మొక్కల సంరక్షణపై కార్యదర్శులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాము. మోతే పట్టీనగర్‌లో పశువులు పల్లెప్రకృతివనంలో మేస్తున్నాయని చెప్పగా సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుని ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.

వరద బాధితులకు సరుకులు పంపిణీ

సరుకులు అందుకుంటున్న వరద బాధితులు

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 15: మండలంలోని ఉల్వనూరులో వరద బాధితులైన 63 కుటుంబాల వారికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పంపిన నిత్యావసర సరుకులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందించారు. కొత్వాల శ్రీనివాసరావు, కంచర్ల చంద్రశేఖర్, బరపటి వాసుదేవరావు, ఎర్రంశెట్టి ముత్తయ్య, ఊకంటి గోపాల్‌రావు, మురళి పాల్గొన్నారు.

సెల్ ఫోన్ స్వాధీనం.. అప్పగింత

టేకులపల్లి, సెప్టెంబర్ 15: ఓ వ్యక్తి, పది నెలల క్రితం పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. దానిని స్వందారుకు అప్పగించారు. ఎస్సై పోగుల సురేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని కొత్తతండా(పి) గ్రామ యువకుడు ధరావత్ వెంకన్న, పది నెలల క్రితం బైక్‌పై వెళ్తుండగా సెల్ ఫోన్ ఎక్కడో జారి పడిపోయింది. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దానిని పోలీసులు కనిపెట్టి స్వాధీనపర్చుకుని, స్వంతదారుకు ఆదివారం అందించారు.

18 నుంచి క్రీడాపోటీలు

అశ్వారావుపేట/దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 15: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్రీడాపోటీలను ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కమిటీ చైర్మన్, ఎంఈవో కేసరి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అశ్వారావుపేట మండల స్థాయి పోటీలు అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాల క్రీడాప్రాంగణంలో, దమ్మపేట మండల స్థాయి పోటీలు పార్కలగండి ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో జరుగుతాయని వివరించారు.

సంతకాల సేకరణ

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 15: సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించవద్దని కోరుతూ ఇఫ్టూ నాయకులు ఆదివారం కొత్తగూడెం పోస్టాఫీస్ అడ్డా వద్ద సంతకాలు సేకరించారు. ఏదులాపురం గోపాలరావు, గౌని నాగేశ్వరరావు, ఎండీ అలీముద్దీన్, సురేష్‌కుమార్, ప్రకాష వీరన్న, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

అశ్వారావుపేట, సెప్టెంబర్ 15: ప్రభుత్వ ఆసుపత్రుల్లోని కాంట్రాక్ట్ సిబ్బందికి జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, బకాయిలు విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వర్కర్లతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. తక్కువ వేతనాలు చెల్లిస్తూ కాంట్రాక్ట్ సిబ్బంది శ్రమను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు.

'రుణ మాఫీ అందకనే ఆత్మహత్యలు'

టేకులపల్లి, సెప్టెంబర్ 15: రెండు లక్షల రూపాయల రుణం మాఫీ కాకపోవడంతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. టేకులపల్లిలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షం-బాధిత రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని, గూడు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని, దెబ్బతిన్న రోడ్లు-కల్వర్టులను మరమ్మతు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎలక్ట్రీషియన్ ట్రైనీ రాత పరీక్ష

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 15: సింగరేణిలో ఖాళీగా ఉన్న ఎలక్ట్రీషియన్ ట్రైనీ కేటగిరి-1 పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేసేందుకు ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ-పీజీ కాలేజీలో రాత పరీక్ష జరిగింది. 133 ఖాళీలకుగాను అర్హులైన 178 అభ్యర్థులకు అధికారులు హాల్ టికెట్లు జారీ చేశారు. 150 మంది హాజరయ్యారు. జీఎం (పర్సనల్) సామ్యూల్ సుదాకర్, జీఎం (విజిలెన్స్) కె.ప్రసాదరావు పర్యవేక్షించారు.

2 నుంచి 'స్వచ్ఛత' స్పెషల్ క్యాంపెయిన్

అధికారులతో మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 15: అక్టోబర్ 2 నుంచి 31వ తేదీ వరకు 'స్వచ్ఛత' స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించునున్నట్లు సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్ చెప్పారు. దీనిపై ఆయన ఆదివారం జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్యాంపెయిన్ విధి విధానాలను, చేయాల్సిన పనులను వివరించారు. బొల్లం వెంకటేశ్వర్లు (ఎస్‌వోటు జీఎం), కృష్ణమోహన్, నరసింహరాజు, రామస్వామి, రవికుమార్, ధనుంజయ్ రెడ్డి, పూర్ణచందర్, క్రిష్టఫర్, నాగరాజు నాయక్, దిలీప్ కుమార్, నాగేశ్వరావు, శివకుమార్ పాల్గొన్నారు.

చిన్నారి ప్రకృతి ప్రేమికుడికి పురస్కారం

పురస్కారం అందుకుంటున్న చిన్నారి విశ్వామిత్ర

చుంచుపల్లి, సెప్టెంబర్ 15: తన చిట్టి చేతులతో మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన చిన్నారి మూడ్ విశ్వామిత్ర చౌహాన్(5)కు కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, నేసనల్ సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూఢిల్లీ, తెలుగు వెలుగు నిర్వాహకులు ఆదివారం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో జాతీయ స్థాయి నంది పురస్కారాన్ని అందజేశారు.

'ఆధునిక వ్యవసాయం'పై నేడు ఎగ్జిబిషన్

టేకులపల్లి, సెప్టెంబర్ 15: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సోమ, మంగళవారాల్లో కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో 'ఆధునిక వ్యవసాయం'పై ఎగ్జిబిషన్ ఉంటుందని ఏవో అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాలు తదితర కంపెనీల స్టాల్స్ ఉంటాయని పేర్కొన్నారు. రైతులు తమ అవగాహన పెంచుకునేందుకు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని కోరారు. 15, 16 తేదీల్లో ఉదయం 10.00 నుంచి రాత్రి 8.00 గంటల వరకు ఉంటుందని తెలిపారు.